## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ధృవీకరణ పత్రాలు

**అరకులోయ, ఆగస్టు 18 ప్రభాతవార్త**



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకువేలి జాతీయ సేవా పథకం యూనిట్ 1,2ల ఆధ్వర్యంలో ఫిబ్రవరి-2022లో నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ధృవీకరణ పత్రాలు విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ కె. పద్మలత చేతుల మీదుగా వాలంటీర్లకు ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో విద్యార్థులు నిరంతర భాగస్వాములు కావాలన్నారు. ఎన్.ఎస్.ఎస్.పీఓలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆ ధృవపత్రాల వలన వాలంటీర్లకు అన్ని రంగాల్లో ప్రత్యేక అవకాశం ఉంటుందన్నారు. కావున విద్యార్థులందరూ ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలన్నారు.

## సింగరాయిమెట్టలో సి.సి.డ్రైన్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**మాధవధార, ఆగస్టు 18 ప్రభాతవార్త**



49వ వార్డు సింగరాయి మెట్ట గ్రామంలో నూతనంగా రూ.1400000 లక్షల రూపాయలతో సి.సి.డ్రైన్లు నిర్మాణం పనులు శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జి.వి.ఎమ్.సి.డిప్యూటీ ఫ్లోర్ లీడర్ 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పాల్గొని కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అల్లు శంకర రావు మాట్లాడుతూ వార్డు అంతటా శరవేగంగా అభివృద్ధి, మౌళిక వసతుల్లో భాగంగా బి.టి.రోడ్లు, సి.సి.రోడ్లు, సి.సి.డ్రైన్లు, స్ట్రీట్ లైట్లు యుద్ధ ప్రాతిపదికన వేయడం జరుగుతుందని సింగారాయి మెట్ట గ్రామంలో సుదీర్ఘ కాలం నుండి సి.సి.డ్రైన్లు పూర్ దెబ్బతినడం వలన స్థానిక ప్రజలు సదరు సమస్యను తెలిపిన వెంటనే అధికారులు ఎ.ఇ. కిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామరాజు, శ్యామ్, ఇమ్యూనిట్స్ నాగేంద్ర తదితరులతో అంచనాల వేయించి టెండర్లు ద్వారా పనులు ప్రారంభించి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్షంగా పని చేయడం జరుగుతుందని తెలిపారు. కె.ఢిల్లీ రావు, ప్రెసిడెంట్ రవి, రమణ, పోలీసు రమేష్, రమణ, సింహాచలం, సి.హెచ్.త్రినాథ్, సి.హెచ్.శ్రీను, బి.శంకర్, కె.మున్నా, కె.కిషోర్, అరుణ, శశి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంచాల పంపిణీ



**మాడుగుల ఆగస్టు 18, ప్రభాతవార్త**

మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన చింతా వెంకట నరసయ్య ఆ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజన సౌకర్యార్థం 380 కంచాలను అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు. దాతలను సర్పంచ్ అభినందించారు. పాఠశాల కమిటీ చైర్మన్ అన్నపూర్ణ అప్పలనాయుడుతో పాటు స్థానిక వైసీపీ నాయకులు సహకార సంఘం అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేష్, చింత వెంకటనారాయణమూర్తి, పడాల అప్పల నాయుడు, అప్పల నరసయ్య, వెంకటరాజు, పాఠశాల అధ్యాపక బృందం వెంకట నరసయ్య దంపతులను అభినందించారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

**మాడుగుల ఆగస్టు 18, ప్రభాతవార్త**



జగనన్న గృహకల్ప పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని మాడుగుల మండల ప్రత్యేక అధికారి జి.ప్రభాకర్ ఆదేశించారు. గురువారం మండలం జగనన్న గృహ నిర్మాణాలపై ఆయన సమక్ష జరిపారు. ఈ సందర్భంగా మావి మండలంలో నిర్మాణం జరుగుతున్న ఇల్లు వివరాలు, ముకుందపురం గ్రామానికి మంజూరు అయినా ఇల్లు ప్రస్తుత పరిస్థితి ఎన్ని ఇళ్ల పూర్తి అయ్యాయి. ఇంకా ఎన్ని ఇల్లు నిర్మాణ దశలో ఉన్నాయి, వంటి వివరాలపై సమీక్ష జరిపారు. సకాలంలో ఇళ్లన్ని పూర్తయ్యే విధంగా సంబంధిత అధికారులు సచివాలయ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. భాగంగా ముకుందపురంలో ఈ క్రాఫ్ విధానాన్ని పరిశీలించారు. అనంతపురం అంగనాడీ కేంద్రాన్ని, సచివాలయాన్ని ఆయన సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ఎండిఓ మీనాకుమారి, హార్టి కల్చర్ అధికారి భాను, వైద్యాధికారి డా.మౌనికతో పాటు వీఆర్వోలు గ్రామ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణ అష్టమ వేడుకలు

**విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త**

స్థానిక ఓలివెట్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణ అష్టమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శైలా జాక్సన్, ప్రిన్సిపాల్ ఆచారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకం : ఎమ్మెల్యే

**గొలుగొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**



రాష్ట్రంలో ఉన్న ప్రతీ కుటుంబానికి నవరత్నాలలో కనీసం రెండు, మూడు పథకాలు అందాయని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. గురువారం గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు హారతి పట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికి సంక్షేమ పథకాలు చేరువ చేయడమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా నవరత్నాల పథకాలను అమలు చేయడం వల్ల రాష్ట్రంలో ఉన్న ప్రతీ కుటుంబానికి లబ్ది చేకూరిందన్నారు. అర్హత ఉండి ఏదైనా పథకంలో లబ్దిచేరకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నవరత్నాల సంక్షేమ ఫలాలతో ఆదుకుంటున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ గిరిబాబు, మండల వైసీపీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సభ్యులు జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టాలి



**భీమునిపట్నం, ఆగస్టు 19 ప్రభాతవార్త**

భీమునిపట్నం మండల మహిళా సమాఖ్య సమావేశంలో స్వయం సహాయక సభ్యు లు జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెలిపారు. పీఎం ఎఫ్ఎం ఈ పథకం ద్వారా ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మహిళా ఎంటర్ ప్రెన్యూర్స్ తయారు చేయాలని తెలిపారు. బ్యాంకుల ద్వారా తక్కువ ప్రీమియంతో అందిస్తున్న ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన సం.కి రూ.426 చెల్లించడం ద్వారా 18-50 సం.ల వయస్సు లోపు వారికి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చునని ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన సం.కి రూ.20 చెల్లించడం ద్వారా 18-70 సం.ల వయస్సు లోపువారికి రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. మండల సమాఖ్య ద్వారా మహిళలు చేపడుతున్న బ్యాంకు లింకేజీ, బీమా, స్త్రీనిధి, ఉన్నతి, మహిళా మార్టులు, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత పథకాలు సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రాజెక్టు మేనేజరు సామాజిక భద్రత పి.వెంకటరమణ, ఏరియా కో ఆర్డినేటర్ కె.సత్యనారాయణ శ్రీనిధి ఏజీఎం సునీత ఏపిఎంఐబి ఆదినారాయణ, ఏపీఎం బి.రంగారావు, ఎస్ఎన్ మేనేజర్ గ్రేస్, ఎసీ సీసీ కృష్ణ మూర్తి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

**భీమునిపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త**



భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు, విశాఖ పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి, భీమిలి రూరల్ మండలం అధ్యక్షులు డిఏఎన్ రాజు ఎక్స్ జెడ్పిటిసి సరగడ అప్పారావు నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పతివాడ రాంబాబు తాళ్లవలస ఎంపిటిసి కోరాడ రమణ, భీమిలి మండల నాయకులు పాల్గొన్నారు.

## భీమిలి రూరల్ మండల విస్తృతస్థాయి సమావేశం

**భీమునిపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త**



భీమిలి రూరల్ మండల విస్తృతస్థాయి సమావేశం (రివ్యూ)లో పాల్గొన్న భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరాడ రాజబాబు గురువారం భీమిలి నియోజకవర్గం పరిధి భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భీమిలి రూరల్ మండలం సర్వసభ్య సమావేశం (రివ్యూ) మండల అధ్యక్షులు డిఏఎన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమం, వాటర్ వెరిఫికేషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరిగిందని తెలిపారు. త్వరితగతిన తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలని అదేవిధంగా వాటర్ లిస్ట్‌లో ఉన్నటువంటి ఓటర్లను గుర్తించి దొంగ ఓట్లను, తొలగించబడిన ఓట్లను కొత్తగా చేర్చబడిన ఓట్లను నిర్ధారించుకొని ఓటర్ లిస్టులో ఉన్న తప్పులను సరి చేసుకోవలసిన బాధ్యత ప్రతి కార్యకర్త పైన ఉందని కనుక ఎవరి గ్రామంలో వారు ఓటరు ఐడెంటిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్పిటిసి సరగడ అప్పారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు ఎరబాల అనిల్ ప్రసాద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పతివాడ రాంబాబు, నాలుగో వార్డు అధ్యక్షులు పాసి నర్సింగ రావు, తాలవలస ఎంపిటీసీ కోరాడ రమణ, దాకమర్రి ఎస్ ప్రకాష్, తమ్మిన రాము, కొమర రాము, సాగి రాంబాబు రాజు ,సరగడ ఈశ్వరరావు, తదితర భీమిలి రూరల్ మండల నాయకులు పాల్గొన్నారు.

## ఓటమెరుగని వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

**భీమునిపట్నం ఆగస్టు 18 ప్రభాతవార్త**



భారత స్వాతంత్ర్య సమరవీరులలో అగ్రగణ్యుడు, అలుపెరుగని పోరాటంతో, ఓటమెరుగని వ్యక్తిత్వంతో, మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహోన్నతమైన వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా వై.ఎస్.ఆర్.సి.పి జీవీఎంసీ 3వ వార్డు తరపున వారి స్మృతికి ఘన నివాళులు అర్పించడమైనది. ఈ కార్యక్రమంలో భీమిలి జీవీఎంసీ 3వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగ రావు, మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ, వాసుపల్లి ఎల్లాజీరావు, రాంభుక్త ప్రభాకర్ నాయుడు, బాకి రమ ణారెడ్డి, అనపర్తి సూర్యప్రకాశరావు, కొండ్రు రామసురప్పడు, చెల్లూరి గౌరి నాయుడు, బోని సంజీవ రావు, వాడమొదల జగ్గారావు, జి.వి.రమణ, ఎం.శేషు, గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళను కించపరిచిన వైసీపి నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మఠం శాంత కుమారి డిమాండ్**

**పాడేరు,ఆగస్టు18,ప్రభాతవార్త**



అల్లూరి సీతా రామరాజు జిల్లా, పాడేరు బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు తాంగుల సత్యవతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మఠం శాంత కుమారి మాట్లాడుతూ ఈ నెల 13న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గం, అడ్డతీగల మండలం, రాయిపల్లి గ్రామంలో ఇంటింటికీ జాతీయ జెండాలను గిరిజన నాయకురాలు బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్న కుమారి ఉచితంగా పంచుతున్న సందర్భంలో అక్కడికి వచ్చిన వైసీపీ గూండా బత్తుల సత్యనారాయణ జాతీయ జెండాను కించపరుస్తూ మాట్లాడటంతో ఎందుకు అలా మన జాతీయ జెండాను కించపరుస్తున్నారని మీకు జాతీయ జెండాపై గౌరవం లేదా అనగా నీకేం తెలుసే కొండ జాతి దాన అంటూ బహిరంగంగా కులం పేరుతో దూషించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని బీజేపీ పార్టీ తరుపున ఒక గిరిజన మహిళా నాయకురాలిగా తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కులం పేరుతో తమ నాయకురాలిని దూషించిన వైసీపీ గుండా బత్తుల సత్యనారాయణపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని, జాతీయ జెండాను కించపరుస్తూ మాట్లాడినందున అతినిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అతను బహిరంగంగా దేశ ప్రజలకు, గిరిజన జాతికి క్షమాపణలు చెప్పాలని, లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మహిళా నాయకురాలు తాంగుల కళావతి తదితరులు పాల్గొన్నారు.

## డిపో మేనేజర్లకు ప్రశంసా పత్రాలు



**విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త**

2021-22 కాలానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా గల 129 డిపోలలో కెల్లా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జోన్-1లోని విజయనగరం, ఎస్.కోట, గాజువాక, మధురవాడ డిపోలకు చెందిన డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్)లను గురువారం ఏపీఎస్ఆర్టీసీ వీసీ, ఎండి సిహెచ్ ద్వారకా తిరుమల రావు, విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలతో అభినందించడం జరిగినది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.ఎస్. బ్రహ్మానంద రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (జోన్-1) చింతా రవికుమార్ పాల్గొన్నారు.

## జీకేవీధి ఎమ్మార్వోకు ఘన సన్మానం

**గూడెంకొత్తవీధి (నర్సీపట్నం) ఆగస్టు 18 ప్రభాతవార్త**



గూడెంకొత్తవీధి మండలంలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌ని ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదుగా జిల్లాస్థాయి ఉత్తమ అధికారిగా అవార్డు తీసుకున్న సందర్భంగా మండల అధికారిగా వారి సేవలను గుర్తించి జీకే వీధి బోడ కొండమ్మ సాంబారి దేవి ప్రెస్ క్లబ్ సంఘం పాత్రికేయ మిత్రులు పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువతో సన్మానిం చడం జరిగింది. మండల పరిధిలో అవార్డులు పొందిన విఆర్వోలు శేఖర్, గంగాభవానిలను పాత్రికేయ మిత్రులు అభినందించారు. రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని కొనియాడారు. అనంతరం మండల కార్యాలయాల్లో బదిలీలపై కొత్తగా వచ్చిన అధికారులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విధులకు అందరూ సక్రమంగా హాజరుకావాలని, పట్టా మార్పిడి, సర్టిఫికెట్ల విషయంలో ఎటువంటి జాప్యం జరగకుండా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి తహాశీల్దార్ తగిన సూచనలు అందించారు. వీఆర్ఓలు మీ మీ పరిధిలో పెండింగ్ లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలని మండలంలో ఉన్న అన్ని సచివాలయాల సిబ్బందికి వివరించారు. అధ్యక్షులు సాయం రమణ, ఉపాధ్యక్షులు సురకత్తి లక్ష్మణ్, కార్యదర్శి పసుపులేటి రామ్మోహన్, సహాయ కార్యదర్శి మాధురి చంటిబాబు, కోశాధికారి సమిరెడ్డి విజయ్, సీనియర్ పాత్రికేయులు బండి దారబాబు, హనుమంతరావు, మిగతా మిత్రులు బోండ్ల రాజ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, సాగిన లక్ష్మణ్, సాగిన శివశంకర్, కిల్లోలక్ష్మణ్ పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకుల పంపిణీ

**పాడేరు, ఆగస్టు 18 ప్రభాతవార్త**

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం, కందిపప్పు, పంచదారతో పాటు పిఎంజికెవై కింద పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం సరఫరాను మరో రెండు రోజుల పాటు పంపిణీ చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా సంయుక్త కలెక్టర్ జె శివ శ్రీనివాసు ప్రతి నెలా 17 వరకు జరిగే పంపిణీని ఈ నెల అదనంగా మరో రెండు రోజులు 19 వరకు పంపిణీ చేస్తామని ఈ అవకాశాన్ని లబ్దిదారులు వినియోగించుకోవాలని జెసి విజ్ఞప్తి చేశారు.

## సచివాలయంలో పూర్తిస్థాయిలో ఆధార్ సేవలు

**గూడెంకొత్తవీధి (నర్సీపట్నం) ఆగస్టు 18 ప్రభాతవార్త**



గూడెంకొత్తవీధి మండలంలో రింతాడ, సంకాడ పంచాయితీల్లో గల గ్రామ సచివాలయంలో పూర్తిస్థాయి ఆధార్ సేవలు అందించడానికి డిజిటల్ అసిస్టెంట్ లకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని, ఇకపై నుంచి పూర్తి ఆధార్ సేవలు సంకాడ సచివాలయంలో అందుబాటులో ఉంటుందని, ఆధార్‌కి సంబంధించిన ఎక్విప్‌మెంట్ ను అందించడం జరిగిందని పరిసర ప్రాంతాల ప్రజలు అందరూ దీనిని సద్వినియోగ పరుచుకోవాలని జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపిడిఓ ఇమ్మానుయేల్, ఏఈఈ పాపారావు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

## గిరిజన బాధితుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తా : ఎమ్మెల్యే

**నర్సీపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త**



ఉపాధి కోసం నర్సీపట్నం వెళ్లి నిన్న ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తుపై నుంచి పడి మృతిచెందిన గిరిజన బాధితుడి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం జరిగేలా చూస్తామని పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. నర్సీపట్నంలో ఉపాధి నిమిత్తం వెళ్లి అతను పనిచేసే భవనం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన జీకేవీధి మండలం గుమ్మరేవుల పంచాయితీ కాకనూరు గ్రామానికి చెందిన జర్త చందు కుటుంబాన్ని పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయాన్ని అడిగితెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలుగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భాగ్యలక్ష్మి తెలిపారు.



## ప్రభుత్వ విప్‌ను కలిసిన అనకాపల్లి డిడిఓ

**చోడవరం ఆగస్టు 18 ప్రభాతవార్త**

అనకాపల్లి జిల్లా అభివృద్ధి అధికారిగా ఇటీవల నియమితులైన ఎస్.మంజులరాణి గురువారం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటివరకు డిడిఓగా ఉన్న మాడుగుల ఎండిఓ నాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డిగా నియామకం కావడంతో ఆ స్థానంలో పెందుర్తి ఎండి ఓఎస్ మంజులరాణిని డిడిఓగా నియమించారు. దీంతో చోడవరం ఎండిఓ శ్యామసుందర్‌తో కలిసి ధర్మశ్రీనీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా అభివృద్ధికి అందరిని సమన్వపరుచుకుని కృషి చేయాలని సూచించారు.

## సిహెచ్‌ఓలుగా ఎంఎల్‌హెచ్‌ఓలు



**మాడుగుల ఆగస్టు 18 ప్రభాతవార్త**

ఇప్పటివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌ఓలుగా పనిచేస్తున్న వారికి సిహెచ్‌ఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ప్రాంతంలో గల సిహెచ్‌ఓలం దరూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ శనివారం సాయంత్రం మాడుగుల బస్టాండ్‌లో గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటం వద్ద కేక్ కట్ చేశారు. తమ సేవలను గుర్తించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కూడా ప్రజాసం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపీ వీ రామధర్మజ, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, ఎస్ గంగాధర్, కృష్ణమూర్తి, కొ ఆప్షన్ నెంబరు ఉన్నిశా, గ్రామ కార్యదర్శి సిహెచ్ నాయుడు, వైసిపి నాయకులు బి శ్రీనివాసరావు, కె శ్రీధర్‌తో పాటు కేజీ పురం కింతలి వడ్డాది లక్కవరం తదితర పిహెచ్ సిలకు చెందిన సిహెచ్‌ఓలు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులు ముంచంగిపుట్టులో పరీక్షలు రాస్తారు : ఎమ్మెల్యే

**ముంచంగిపుట్టు, ఆగస్టు 18 ప్రభాత వార్త**



మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్షా కేంద్రం పెదబయలులో ఏర్పాటు చేయడం వల్ల ప్రతీ సంవత్సరం పరీక్షలు రాసేందుకు ఇబ్బందులు పడుతున్నామని కళాశాల సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఫోన్‌లో ఐటిడిఏ పీఓతో మాట్లాడి పరీక్షా కేంద్రం విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు ముంచంగిపుట్టు కేంద్రంలోనే రాస్తారని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఇంటర్మీడియట్ అధికారులతో మాట్లాడడం జరిగిందని, వారు సైతం సానుకూలంగా ఉన్నారని, దశల వారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైసీపీ నేతలు జగబంధు, పిత్‌బాస్, తిరుపతి, పులిరాజు, దాసులు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం

**ముంచంగిపుట్టు, ఆగస్టు 18 ప్రభాతవార్త**



మండలంలో గల జర్జుల పంచాయితీ కేంద్రంతోపాటు కులబీరు, చిన్నతమ్మెంగుల, ఆములగూడ, బొదిలిగూడ, గుర్రాలబయలు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఫాల్గుణ 261 గడపలకు వెళ్లి గిరిజనులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. అమ్మా మీ పిల్లలు చదువుకుంటున్నారా... అమ్మ ఒడి వస్తుందా... రైతు భరోసా వస్తుందా... అవ్వా మీకు ఒకటో తారికుకు పింఛన్ వస్తుందా అంటూ అప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్దిదారులకు పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరించారు. గ్రామాల్లో గిరిజనులంతా ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయని, గతంలో పంచాయితీ కేంద్రాలకు వెళ్లి పథకాలు పొందేవారమని ఇప్పుడు నేరుగా ఇంటికే పథకాలు అందుతున్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. భారీగా వర్షం కురుస్తున్నా ఎమ్మెల్యే ఫాల్గుణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు గడప గడపకు కార్యక్రమం గొడుగులు పట్టుకునే వెళ్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ సంస్కరణలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టారని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జీవితాంతం గుర్తుంటాయని దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి, సంక్షేమం జగనన్న పాలనలోనే జరుగుతుందన్నారు. గిరిజన అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఘనత కేవలం ముఖ్యమంత్రికే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైసీపీ మండల అధ్యక్షులు పి.మల్లికార్జున్, సర్పంచ్‌లు, పార్తిమ్మ, రమేష్, బాబూరావు, నీలకంఠం, గంగాధర్, ఎంపీటీసీలు విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఎంపీడీవో ఏవివికుమార్, సిఐ ఏ.సత్యనారాయణ, తహశీల్దార్ నర్సమ్మ, వైసీపీ మండల నేతలు పద్మారావు, అర్జున్, మత్స్యలింగం, జగబంధు, దాసు, పులిరాజు, జయదేవ్, కొండలరావు, జగన్నాధం, జగన్ రాంబాబు, ఈఓపీఆర్‌డివో చిన్నాన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన విద్యా సంస్థలోపలకి బయట వ్యక్తుల ప్రవేశం నిషేధం

**పాడేరు, ఆగస్టు 18 ప్రభాతవార్త**

గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జువైనల్ జస్టిస్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ విద్యా సంస్థలోపలికి బయట వ్యక్తుల ప్రవేశం నిషేధించామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లోకి ఎటువంటి బయట వ్యక్తులను అనుమతించవద్దని ఇప్పటికే అన్ని గిరిజన విద్యా సంస్థలకు సర్క్యులర్స్ ఆదేశాలు జారీ చేశామన్నారు. హైకోర్టు జువైనల్ జస్టిస్ ఆదేశాలను కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల నిర్వాహకులు తూచ తప్పకుండా అమలు చేయాలని సూచించారు. హైకోర్టు జువైనల్ జస్టిస్, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలను అతిక్రమించి బయట వ్యక్తులు విద్యా సంస్థల లోపలికి ప్రవేశిస్తే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల సంరక్షకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. జారీ చేసిన ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని కోరారు.

విజయనగరం వార్త 25

శుక్రవారం, 19 ఆగస్టు 2022 పార్వతీపురం మన్యం


## మహిళలకు అండగా మన ప్రభుత్వం డిప్యూటీ సిఎం



**సాలూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త :** వైఎస్సార్ ప్రభుత్వంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా ఉంటూ అటు రాజకీయపరంగా ఎన్నో పదవులు ఇస్తూ ఇటు ఉద్యోగ అవకాశాలు ఎన్నో కల్పిస్తూ మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని డిప్యూటీ సిఎం రాజన్నదొర స్పష్టం చేశారు. గురువారం ఉదయం పట్టణ ఎనిమిదో వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ జరజాపు దీప్తి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అక్కడ ఉన్న ముస్లిం మహిళలు ఆయనను పూల దండ వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైఎస్సార్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట మూడేళ్ళ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటూ తోడబుట్టిన అన్నగా ఉంటూ జగనన్న అని ఎంతో గౌరవంగా మహిళలు పిలుచుకుంటున్నారన్నారు. ఇంకా రెండేళ్ళ పాలనలో అనేక సంక్షేమ పథకాలు మున్ముందు ఉంటాయని భరోసా కల్పించారు. అందువలన మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రిగా గెలిపించా లని కోరారు. వైకాపా సీనియర్ నాయకులు జరజాపు ఈశ్వరరావు, సూరిబాబు, వంగపండు అప్పలనాయుడు, రాపాక మాధవరావు, రాంబాబు, అంగన్వాడీ కార్యకర్తలు, ముస్లిం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ నిర్వాహకుల సమస్యల పరిష్కరించండి



**కొత్తవలస, ఆగస్టు 18 ప్రభాతవార్త :** మండలంలోని అంగన్వాడీ నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి మెమోరాండం సమర్పించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు నాసిరకం సెల్‌పోన్లు ఇచ్చి రకరకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేయాలని లేకపోతే వేతనాలు నిలిపివేస్తామని అలాగే బయోమెట్రిక్‌తో చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కోరుతూ మెమోరాండం సమర్పించింది. అంగన్వాడీ సెంటర్‌లకు 15 రోజులలోపు ట్యాప్‌లు మంజూరు చేయాలని లేని పక్షంలో పని చేయని ఫోన్లతో పనిచేయలేమని కోరుతూ మెమెరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి అనుసూయ, కె.పద్మావతి, కాకర తులసి తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలి సిహెసికి 50 పడకల మంజూరు : ఎమ్మెల్యే




**బొబ్బిలి: ఆగస్టు18 ప్రభాతవార్త :** బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్రానికి 30 నుంచి 50 పడకలు ఆసుపత్రిగా ప్రభుత్వం ఉత్తర్యులు జారీ చేసిందని చైర్మన్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. గురు వారం స్థానిక ఆసుపత్రి అబివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ప్రబందకులు గేదెల శశిభూషనరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ శశిభూషనరావు మాట్లాడుతూ 50 పడకల మంజూరి అవ్వడానికి ఎమ్మెల్యే చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు 21 మంది సిబ్బంది ఉన్నారని, 50 పడకల మంజూరితో 22 పోష్టులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆసుప్రతికి వచ్చేరోగులతో సహాయకులుగా వచ్చే వారికి మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సక్రమంగా పనిచేయాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తూముల బంగారురాణీ, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాపై కాదు.. ఇకమీపై కూడా నిఘా!




**శృంగవరపుకోట, ఆగస్టు 18 ప్రభాతవార్త :** ఇక నుంచి పోలీస్‌స్టేషన్‌లలో కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇటీవల సుప్రీం కోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని పోలీస్టేషన్‌లలో సిసికెమోరాలు ఏర్పాటు చేయడం వలన పోలీస్ వ్యవస్థ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించుకునేందుకు, పోలీస్ సిబ్బంది ప్రవర్తన, పోలీస్‌స్టేషన్‌లో అక్రమ నిర్బందాలు, వ్యక్తుల పట్ల ఉద్దేశ్యపూర్వకంగా లావాదేవీలు, మానవ హక్కులు పరిపరక్షించించడం తదితర కట్టడి చేసేందుకు సిసి కెమెరాలు ఏర్పాటుకు దోహద పడతాయి. ఈ సిసి కెమెరాలు పోలీస్‌స్టేషన్‌లో ప్రతీ విభాగాలులోనూ ఏర్పాటు చేయనున్నారు. ముందు పోలీస్టేషన్ ప్రవేశ ద్వారం, రిసెప్షన్ రూమ్, ప్రదానహాలు, స్టేషన్ ఆఫీసర్ రూమ్, రైటప్ రూమ్, ఆయుదాలు, సాక్ష్యాధారాలురూమ్, పురుషుల, మహిళల లాకప్‌రూమ్‌లు వద్ద, కంప్యూటర్ రూమ్, పార్కింగ్ రూమ్‌ల వద్ద ఈ సిసికెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ సిసి కెమెరాలు పర్యవేక్షణకు సంబందించి ఒక కమిటీలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తం మీద పోలీస్‌స్టేషన్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు ఒక కీలకమైన తీర్పు ఇక నుంచి మాపై కాదు ఇక మీపైకూడా నిఘా ఉంచాల్సిందే.

## ఎస్సీల హక్కులను హరిస్తున్న వైసిపి ప్రభుత్వం

### – టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజప్పన్న



**నెల్లిమర్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఎస్‌సిల హక్కులను హరిస్తున్నదని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజ ప్పన్న ఆరోపించారు. ఆయన నెల్లిమర్లలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్‌సిలపై వివక్ష చూపిస్తున్న దన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా నిధి పేరుతో ఉన్న పథకంలో అంబేద్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకోవడం అంబేద్కర్‌ను అవమానపరచడమేనని ఆయన అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళగిరిలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకుడు మైనర్‌బాబుతో పాటు పలు వురు ఎస్‌సి నాయకులు శాంతి యుతంగా చేస్తున్న ఉద్యమాన్ని భగ్నం చేయడం దారుణ మన్నారు. దళితులకు ఈ ప్రభుత్వంలో స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. ఈ అంశంలో సిఎం జగన్మోహనరెడ్డి నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రాజప్పన్న అన్నారు.

## రెండు బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి



**వేపాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త :** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వల్లంపూడి ఎస్.ఐ కె.రాజేష్ విలేకర్లకు తెలిపారు. వేపాడ మండలం అరిగిపాలెం ముకుందపురం గ్రామాలలో అక్రమంగా నడుపుతున్న రెండు రెండు బెల్ట్‌షాపులపై తమ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో అరిగిపాలెం గ్రామంలో 12 మద్యం సీసాలు, ముకుందపురం గ్రామంలో 8 మద్యం బాటిళ్ళు లబించగా డి.అప్పారావు, గోపిశెట్టి రాములను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

## 27వ రాష్ట్ర స్థాయి మహాసభలను విజయవంతం చేయండి

### – సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ




**విజయనగరం (ప్రభాత వార్త) :** ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి 27వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా వీటికి సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆ ఉద్యమంలో అగ్రభాగాన నిలుస్తూనే రైతులు, బడుగు, బలహీన వర్గాల మహిళలు, కార్మికులు, పేద, మధ్య తరగతి ప్రజానీకం జీవితాల్లో వెలుగులు నింపాలని మహాజ్వాల పోరాటాలు చేసిందన్నారు. ఎనోన ఒడిదుడుకులను అధిగమిస్తూ మాతృభూమికి స్వేచ్ఛావాయువులు అందించాలని కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేతలు చేసిన త్యాగాలు అజరామరంగా నిలిచాయన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుండి దేశం బ్రిటీష్ కాలంనాటి పరిస్థితులు దిశగా తిరోగమన బాట పట్టిందన్నారు. ప్రభుత్వ సంస్థలను, కంపెనీలను, ప్రజల ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పెట్టేందుకు నేడున్న మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. రాష్ట్రంలో విషయంలో విభజన చట్టం పూర్తిగా అమలు కాలేదని, 2014 ఎన్నికల ప్రచార సభల్లో మోడీ చేసిన ఏ ఒక్క వాగ్దానం కార్యరూపం దాల్చలేదన్నారు. ఇటువంటి సమయంలో విశాఖనగరంలో 26, 27, 28 తేదీల్లో జరిగే 27వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు పాల్గొన్నారు.

## పోర్ట్‌సిటీ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**విజయనగరం, ఆగస్టు 18 ప్రభాతవార్త :** పోర్ట్‌సిటీ పాఠశాలలో కృష్టాష్టమి వేడుకల్లో భాగంగా ఎల్.కె.జి నుంచి మూడోతరగి చదువుతున్న విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణ పోటీల్లోను, ఫ్యాన్సీడ్రెస్, నృత్య, పద్యాలు, చిత్రలేఖనం తదితర పోటీలలో సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఉట్టి సంబరం అందరినీ ఆకట్టుకుంది. ఈ పోటీలలో పాల్గొన్న చిన్నారులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు మాట్లాడుతూ విద్యార్థులలో చిన్నప్పటి నుంచి ఆద్యాత్మిక భావనాలు పెంపొందిపజేయాలని, ఇలాంటి వివిధ రకాలైన పోటీలలో పిల్లలు ఇప్పటి నుంచే పాల్గొనటం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చంటి, పాఠశాల ప్రిన్సిపాల్ గిరిజారాణి, అకాడమిక్ అడ్వైయిజర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు.

### గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల

## కళాశాలను సందర్శించిన ట్రైబల్ డైరెక్టర్



**కురుపాం, ఆగస్టు 18 ప్రబాతవార్త :** కురుపాం ఎపి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల గురుకుల కళాశాలను ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ జాహ్నవి గురు వారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులను పరిశీలించి తరగతి గదులకు వెళ్ళి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేయగా విద్యార్థుల నుంచి సరైనటువంటి సమాదానాలు రాకపోవడం వలన అసంతృప్తి వ్యక్తం చేసి గిరిజన విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు లేకపోతే ఎలా అని ఉపాధ్యాయులకు ప్రశ్నించి ఉపాధ్యాయులు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని ఆమె ప్రిన్సిపాల్‌కు హెచ్చరించారు. అనంతరం రావాడ రామభద్రపురం, సంక్షేమ ఆశ్రమపాఠశాలను, దండునూర గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇఇ జె.శాంతేశ్వరరావు, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్‌ఒ డాక్టర్ కల్యాణి డిఇఇ ఎస్.సింహాచలం, ఎఇ శ్యాంప్రసాద్, ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకల నట్ల నివారణకు మందులు పంపిణీ



**గరుగుబిల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త :** మండలంలోని లకనాపురం గ్రామంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు చేతుల మీదుగా 1100 గొర్రెలు, మేకలు నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభించారు. తుదపరి వైస్ చైర్మన్ మాట్లాడుతూ గొర్రెలు మేకలు పెంపకం దారులు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతీ ఏడాది నట్టల నివారణ మందులు పట్టిక ముందు వాటి పేడను వ్యాధి నివారణ ప్రయోగశాలలో వాటిని పరీక్షలు చేయించాలని తదుపరి పశువైద్యాధికారి సలహ తీసుకుని వాటిని సరిపడే మందులను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నీరుడుబిల్లి లక్ష్మి, డాక్టర్ గణపతిరావు, డాక్టర్ ఎస్ సురేష్‌కుమర్, ఎం.శ్రీరాముల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుడి ప్రారంభోత్సంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి



**పూసపాటిరేగ, ఆగస్టు 18 ప్రభాతవార్త :** మండలంలోని చిన్న పతివాడ గ్రామంలో నూతనంగా నిర్మించబడిన శ్రీ సూరమ్మతల్లి గుడి ప్రారంభోత్సవంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు గుడి కమిటీ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంది ఆదినారాయణ, కోరాడ రాంబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీతత్వంతో చదవాలి



**గరివిడి, ఆగస్టు 18 ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యలో పోటీతత్వాన్ని అలవరుచుకుని విద్యాభ్యాసం చేయాలని ఎ.ఎం.సి మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వర రావు సూచించారు. నిబద్ధత, అంకిత భావంతో ప్రతీ విద్యార్థి ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు అదిరోహించేందుకు పాటు పడాలని ఆయన ఆకాంక్షించారు. ఆజాద్‌కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య నిర్వహించిన క్విజ్ పోటీలో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. కొండలక్ష్మీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, అబ్బాస్ పాఠశాల ద్వితీయ బహుమతి, కొండపాలెం ఉన్నత పాఠశాల తృతీయ బహుమతి సాదించింది. ఆయా పాఠశాల విద్యార్థులకు బహుమతుల ప్రదానం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మీసాల మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా విద్యార్థులు చదివి తమ విజ్ఞానానికి పదును పెట్టాలన్నారు. ఎంపిడిఒ గొర్లె బాస్కరరావు, మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, కొండలక్ష్మీపురం హిందీ ఉపాధ్యాయులు రామయ్య, అబ్బాస్, కొండపాలెం పాఠశాలల ప్రదనోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎంపిడిఒ, ఎంఇఒ హెచ్‌ఎంలు అబినందనలు తెలిపారు.

## జాడలేని భాజాపా..!

### – నాయకత్వ లేమితో సతమతం!

### – కానరాని క్యాడర్!

### – నేతల పర్యటనలకే పరిమితం!

**విజయనగరం (ప్రభాత వార్త) :** ఉమ్మడి విజయనగరం జిల్లాలో భారతీయ జనతా పార్టీ జాడ కనిపించడం లేదు. ఆ పార్టీకి చెందిన నేతలు అప్పుడప్పుడు చప్పుడు చేయడమే తప్ప రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకునేందుకు కూడా ఏమాత్రం ప్రయత్నం చేయకపోవడం విశేషం. జిల్లాలో ఆ పార్టీ పరిస్థితి పేరుగొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. జాతీయ స్థాయిలో ఒక వెలుగు వెలుగుతున్న భారతీయ జనతా పార్టీ ఉమ్మడి జిల్లాలో మసకబారిందనే చెప్పాలి. అప్పుడప్పుడు ఆ పార్టీ నేతలు ప్రకటనల చప్పుడు చేయడానికే పరిమితమయ్యారు. జిల్లాలో నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. క్యాడర్ సైతం రాజకీయ గందరగోళంలో కొట్టుమిట్టాడుతోంది. జాతీయ స్థాయి నేతల ప్రకటనలు, కార్యక్రమాలు, పత్రికల్లో, టీవీల్లో చూసి మురిసిపోవడమే తప్ప జిల్లాలో మాత్రం ఎలాంటి హడావిడి లేకుండానే గడిచిపోతోంది.

**పథకాలున్నా.. ఫలితం సున్నా..!**

కేంద్రంలో బీజేపీ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఉత్తరాధి రాష్ట్రాలో పైచేయిగా కొనసాగుతోంది. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కూడా నువ్వా.. నేనా అన్న పోటీని ఇస్తోంది. కానీ రాష్ట్రంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. రాష్ట్రస్థాయిలో ఆ పార్టీ నేతలు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వ పనితీరుపై తీవ్రంగా స్పందిస్తున్నారు. ప్రజల పక్షాన నిలిచి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టింది. అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. కానీ ఏ ఒక్క పథకం గురించి కూడా సాక్షాత్తు బీజేపీ నేతలకు తెలిసిన దాఖలాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వానికి ధీటుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల వివరాలను ప్రజలముందుంచడంలో బీజేపీ జిల్లా నాయకత్వం విఫలమైందనే చెప్పాలి. పథకాలను ప్రచారం చేయడంలో కూడా బీజేపీ నాయకులు ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారు.

**నేతల పర్యటనలకే పరిమితం!**

బీజేపీకి చెందిన జాతీయ, రాష్ట్రస్థాయి నేతలెవరైనా జిల్లాకు వచ్చినప్పుడు మాత్రమే ఆ పార్టీ జిల్లా నేతలు కనిపిస్తారు. అప్పుడు మాత్రం హడావిడి చేస్తారు. ముందురోజు నగరమంతా ఫ్లక్సీలతో హోరెత్తిస్తారు. పార్టీ జెండాల తోరణాలతో మేమున్నామంటూ ప్రజలకు గుర్తు చేస్తారు. నేతలు వచ్చిన దగ్గర నుంచి తిరిగి వెళ్లేవరకు ఆర్భాటం చేస్తారు. ఎవరికి వారే విడివిడిగా బలప్రదర్శనకు విఫలయత్నం చేస్తారు. జాతీయ, రాష్ట్ర నేతల దృష్టిలో పడేందుకు రాజకీయ ఫీట్లు చేస్తారు. నేతలు అలా వెళ్లగానే ఎవరికి వారు కనిపించకుండా పోతారు. ఎవరు ఎక్కడ ఉన్నారో కూడా తెలియదు. అసలు ఉన్నారా లేదా అన్న అనుమానం కలగక మానదు.

**వర్గపోరుతో సతమతం..!**

ఈమాత్రం దానికి జిల్లాలో నాయకుల మధ్య వర్గపోరు ఎక్కువగానే ఉంది. క్యాడర్ లేకపోయినా నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పట్టణ, గ్రామీణ స్థాయిలో బీజేపీకి సరైన కార్యకర్తలు లేరు. వాట్సాప్ గ్రూపుల్లో మోదీ పేరు చెప్పుకుని ప్రకటనలు చేసే ఒకరిద్దరు యువ నాయకులు కనిపిస్తారు తప్ప ప్రజల మధ్య నిలబడి నినదించే నాయకుడు ఒక్కడు కూడా ఉండరు. దీనికి తోడు ఉన్న ఒకరిద్దరు నాయకులు వేరువేరు గ్రూపులు కూడా సాగిస్తారు. తమ గ్రూపే అసలు సిసలైందన్న రీతిలో వ్యవహరిస్తారు. అది కూడా జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు వచ్చినప్పుడే కనిపిస్తారు. ప్రజలపక్షాన నిలిచి ప్రజల కోసం పాటుపడే నాయకులు మాత్రం లేరు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నట్లు కూడా కనిపించదు. రెడ్డి పావని వర్గం ఒకటైతే.. కుసుమంచి వర్గం మరొకటి. మరోవైపు పాకలపాటి వర్గం తయారు. ఇలా ఎవరికి వారే.. యమునాతీరే అన్న రీతిలో నాయకత్వ పోరుతో ఆ పార్టీ సతమతమవుతోంది. విచిత్రం ఏమిటంటే కార్యకర్తలు లేకపోయినా నాయకులు తమ వర్గపోరుతో హడావిడి భీభత్సంగా చేస్తారు. దీనికి తోడు ఇటీవల కాలంలో కొందరు యువ నాయకులమంటూ వాట్సాప్ గ్రూపుల్లో హడావిడి చేయడం గమనార్హం. అది కూడా జాతీయ స్థాయిలో పార్టీసాధించిన విజయాలు, నరేంద్రమోడీ ప్రసంగాలు గుప్పిస్తూ ఆహా.. ఓహో.. అంటూ ఊదరగొడుతున్నారు. అంతకు మించి ప్రజల కోసం చేసిన కార్యక్రమమంటూ ఏదీ లేదు. కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న పథకాల ఊసు అంతకన్నా లేదు. నిజానికి జిల్లా నాయకులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి తెలుసా అనేది సందేహాస్పదమే.

**నాయకుల తీరే వేరు..!**

బీజేపీ జిల్లా నాయకుల రూటే సపరేటు.. ఏ పార్టీకి చెందిన నాయకులైనా సమయానుకూలంగా సందర్భాన్ని బట్టి స్పందిస్తారు. స్థానిక సమస్యలపై దృష్టిపెడతారు. కానీ జిల్లా బీజేపీ నాయకులు మాత్రం ఇంతవరకు జిల్లాలో ఒక్క సమస్యపై కూడా దృష్టిసారించిన పాపాన పోలేదు. నాయకులు ఎవరికి వారు మీడియా సమావేశం నిర్వహిస్తారు. అది కూడా జాతీయస్థాయిలో ప్రధానమంత్రి మోదీ చెప్పిన విషయాలను చెప్పేందుకు సిద్ధమవుతారు. రాష్ట్రస్థాయిలో ఆ పార్టీ అధ్యక్షుడు చేసిన ప్రకటననే మీడియా సమావేశంలో చదివి వినిపిస్తారు. ఒకరిద్దరు నాయకులైతే ఆలోచించి ఆలోచించి ఓ నాలుగు వాఖ్యాలు వల్లెవేస్తారు. కేవలం పత్రికల్లో తమ నాయకత్వాన్ని అప్పుడప్పుడు ప్రదర్శించుకునేందుకే మీడియా సమావేశాలన్నట్లు వ్యవహరించడం గమనార్హం. బీజేపీ నాయకుల తీరు చూసి జనం అక్కడ (కేంద్రం) అలా.. ఇక్కడ (జిల్లాలో) ఇలా అనుకుంటూ నిట్టూర్చడం సర్వసాధారణమైంది.

**కుర్చీలాట..!**

జిల్లాలో బీజేపీ నాయకత్వానికి కుర్చీలాట జరుగుతోంది. ఎవరికివారు కుర్చీ మాదే అంటూ అప్పుడప్పుడు గప్పాలు పలుకుతుంటారు. నేతలు వచ్చినప్పుడు హడావిడి చేస్తారు. ఆ నాయకుల వెనుక కూడా పట్టుమని పది మంది కూడా ఉండరు. ఆరోజుకి తెచ్చుకున్న ముగ్గరు నాలుగురితో తమ నాయకత్వ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. పార్టీ గురించి మాట్లాడేందుకు నోటి నుంచి మాట రాదు, పార్టీ కోసం ఖర్చు పెట్టేందుకు జేబు నుంచి పైసా తియ్యరన్న పేరు జిల్లా బీజేపీ నాయకులకు మెండుగా ఉంది. ఈ కారణంగానే అక్కడక్కడ ఉన్న బీజేపీ అభిమానులు సైతం ఈ నాయకుల ధోరణిని చూసి పెదవి విరుస్తున్నారు. సరైన నాయకత్వం ఉంటేనే తప్ప జిల్లాలో బీజేపీ రాజకీయంగా నిలదొక్కుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇదే రీతిలో రానున్న ఎన్నికల్లో పోటీ చేసినా స్థానికంగా కూడా ప్రజా ప్రతినిధిగా ఎన్నికయ్యే అవకాశాలు తక్కువనే చెప్పవచ్చు. పార్టీ పేరు చెప్పుకుని పదవుల లబ్ధిపొందుదామన్న తపన ఉన్నంతవరకు జిల్లాలో బీజేపీ పరిస్థితి ప్రకటనలకే పరిమితమని చెప్పక తప్పదు.

## రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఎఒ



**రామభద్రపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త :** మండలంలోని శిర్లం రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయాధికారి గురువారం సందర్శించారు. ప్రతి రైతు కూడా పంట నమోదు చేసుకోవాలని తెలియజేయడం జరిగిందని అలాగే పంట నమోదు ప్రక్రియను పరిశీలించడం జరిగింది. ఇక్రాప్ చేసుకోవాలని చాలా ఉపయోగా ఉన్నాయని తెలియజేశారు.